క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



సేంద్రియ విధానాలను వివరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : శ్రీపద్మావతి మహిళా వర్సిటీ ఎన్ఎస్ఎస్ బ్యూరో, హాస్టల్స్, గ్రామీణాభివృద్ధి సంక్షేమ సంస్థ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవాలో భాగంగా శుక్రవారం గ్రీన్ టీమ్ ప్రారంభించారు. ప్రత్యేక అతిథిగా ఎస్వీయూ మాజీ వీసీ ఆర్.రామమూర్తి విచ్చేసి విద్యార్థినులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కెమికల్స్ ద్వారా పండించే పంటలతో భూమికి, ఆరోగ్యానికి నష్టం కలుగుతుందన్నారు. సేంద్రియ సాగు ఉత్పత్తులను భుజిస్తే ఆరోగ్యంగా జీవించగలమని వెల్లడించారు. సంక్షేమ సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గంగాధరం మాట్లాడుతూ వర్మీకంపోస్ట్ తయారు చేసే విధానం, సస్యరక్షణ పద్ధతులు పంటల్లో రసాయనాల వాడకం గురించి వివరించారు. అనంతరం వర్సిటీ వసతి గృహాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వ్యవసాయ క్షేత్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు మాధవి, యువశ్రీ, హేమావతి, రుక్మిణి, పద్మ, వజీహాభాను పాల్గొన్నారు.

ఘనంగా పర్యాటక దినోత్సవం



వేదికపై అధ్యాపకులు

తిరుపతి సిటీ : ఎస్జీఎస్ ఆర్ట్స్ కళాశాల టూరిజం, హిస్టరీ విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ డాక్టర్ బి.సత్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక కాలంలో పర్యాటకం విశిష్టతను వివరించారు. తిరుమల ప్రపంచంలోనే ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రమని వెల్లడించారు. పట్టుదలతో విద్యనభ్యసించిన టూరిజం విద్యార్థులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.జగదీష్ కుమార్, కత్తి భాస్కరన్, అధ్యాపకులు పరమేశ్వర్, ఎన్.వినోద్, ప్రధా, ప్రియాసింగ్ పాల్గొన్నారు.

రుయాలో ఫ్రైడే.. డ్రై డే



పారిశుద్ధ్య పనులు పర్యవేక్షిస్తున్న ఏఆర్ఓ హరికృష్ణ

తిరుపతి తుడా : రుయా ఆస్పత్రిలో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించినట్లు ఏఆర్ఓ హరికృష్ణ, హెల్త్ సూపర్‌వైజర్ కేఆర్ ప్రకాష్ తెలిపారు. వారు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డే చేపడుతున్నట్లు వెల్లడించారు. ఆస్పత్రి ఆవరణలోని మురుగునీటి కాలువలను శుభ్రంతోపాటు దోమల నివారణకు మలాథియాన్ మందు పిచికారీ చేయించినట్లు వివరించారు. ఆస్పత్రి ప్రాంగణంలో చెత్తాచెదారాలను ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని సూచించారు. ఈ మేరకు రోగులు సహకరించాలని కోరారు.

శివప్రసాద్‌కు డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ జియాలజీ విభాగం పరిశోధక విద్యార్థి కె.శివప్రసాద్‌కి డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ టి.మధు పర్యవేక్షణలో ఆయన 'ఆంధ్రప్రదేశ్ చిత్తూరు జిల్లాలోని పెద్ద వాగు నదీ పరీవాహక ప్రాంతంలో రిమోట్ సెన్సింగ్ జీఐఎస్ పద్ధతులను ఉపయోగించి హైడ్రోజియోలాజికల్ అంశాల సమగ్ర అధ్యయనం' అనే అంశాలపై పరిశోధన పత్రాలను సమర్పించారు. డాక్టరేట్ సాధించిన శివప్రసాద్‌కు అధ్యాపకులు, సహచరులు అభినందనలు తెలిపారు.

కామ్రేడ్ సుధాకర్‌కు నివాళి



నివాళులర్పిస్తున్న రెవెన్యూ సిబ్బంది

రామచంద్రాపురం: తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ మాజీ జనరల్ సెక్రటరీ కామ్రేడ్ టి.సుధాకర్ ప్రసాద్ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ వెంకటరమణ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సుధాకర్ ప్రసాద్ చేసిన సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో డీటీ అన్వర్‌బాషా, ఆర్ఐ కృష్ణమ్మ, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ, వీఆర్ఓలు సతీష్, ప్రసాద్, బాబుఖాన్, సాయి, నాగజ్యోతి, వర్మ పాల్గొన్నారు.

నవీన శాకం



మిద్దెపై పెంచుతున్న తోట

తిరుపతిలో మిద్దెలు పచ్చ దుప్పటి కప్పుకుంటున్నాయి. పెరటి తోటలకు నిలయంగా మారుతున్నాయి. సేంద్రియ విధానంలో సాగు చేస్తున్న కూరగాయ మొక్కలతో కళకళలాడుతున్నాయి. తక్కువ విస్తీర్ణంలో ఎక్కువ ఉత్పత్తులను సాధించేందుకు ఉపయోగపడుతున్నాయి. ఇంటి యజమానుల వినూత్న ఆలోచనలకు ఊపిరిపోస్తున్నాయి. ఈ మేరకు మేడలపై వివిధ రకాల తోటలు ఇబ్బడిముబ్బడిగా దర్శనమిస్తున్నాయి. ప్రజలకు క్రిమి సంహారక మందుల రహితంగా ఆరోగ్యకమైన పంటలను అందిస్తున్నాయి. ఈ క్రమంలోనే మార్కెట్ ధరాఘాతం నుంచి ఉపశమనం కలిగిస్తున్నాయి.

- తిరుపతిలో పెరుగుతున్న మిద్దె తోటలు
- మేడలపై కుండీల్లో సాగవుతున్న కూరగాయలు
- ఇంటికి.. ఒంటికి మంచిదంటున్న నగరవాసులు

తిరుపతి అర్బన్ : తిరుపతిలో పెరటి తోటల పెంపకంపై నగరవాసులు ఆసక్తి చూపుతున్నారు. కొద్దిపాటి స్థలం దొరికినా మొక్కలు పెంచుకుంటున్నారు. ముఖ్యంగా మేడ మీద వివిధ రకాలను కూరగాయల మొక్కలను పెంచుతూ నాణ్యమైన ఉత్పత్తులు సాధిస్తున్నారు. ఇంటిలోని వ్యర్థాలనే ఎరువులుగా ఉపయోగించుకుని కుండీలో పెరిగే మొక్కల నుంచి తీగ జాతుల వరకు సాగు చేసుకుంటున్నారు. మార్కెట్‌లో నిత్యం పెరుగుతున్న ధరల తాకిడిని తట్టుకోలేక సేంద్రియ ఎరువులతో కూరగాయలను పండించి వాడుకుంటూ ఆరోగ్యాన్ని సంరక్షించుకుంటున్నారు.నగరంలో సుమారు 1.50 లక్షల కుటుంబాలు ఉన్నాయి. దాదాపు 5లక్షల మందికి పైగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో తిరుపతిలోని పలు ప్రాంతాల్లో మిద్దె పంటల సాగు విస్తరిస్తోంది. కొందరు ఔత్సాహికులు మిద్దె తోటలపై వ్యవసాయశాఖ అధికారుల సలహాలు సైతం తీసుకుంటూ వినూత్నంగా కూరగాయలను పండించేందుకు ప్రయత్నిస్తున్నారు.

వ్యాయామం.. ఉల్లాసం

పెరటి, మిద్దె తోటల పెంపకంతో శరీరానికి వ్యాయామం, మానసిక ఉల్లాసం పొందవచ్చు. తాజా కూరగాయలు సైతం అందుబాటులోకి వస్తాయి. ఇంటిపై తక్కువ స్థలం ఉన్నవారు నిలువు సేద్యం పద్ధతిని ఉపయోగించుకోవడం ఉత్తమం.

ప్రోత్సాహకాలు అందించాలి

నగరంలో సుమారు 30 శాతం మంది ప్రతి ఇంటి మిద్దెపైన తోటలు పెంచుకుంటున్నారు. ప్రధానంగా పలు కాలనీల్లో ఎక్కువగా పండ్లు, పూలు, కూరగాయలతో పాటు ఆయుర్వేద మొక్కలను సైతం పెంచుతున్నారు. బెంగుళూరు, చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలలో ప్రభుత్వమే పెరటి, మిద్దె తోటలు పెంచుకునే యజమానులకు విత్తనాలు, సేంద్రియ ఎరువులు, పరికరాలు వంటివి కిట్‌ల రూపంలో సబ్సిడీతో అందిస్తోంది. అలాగే తిరుపతి నగరవాసులకు సైతం ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించాల్సిన అవసరముంది.

మూడేళ్లుగా ఇవే వాడుతున్నాం



మిద్దె తోటలో సేంద్రియ ఎరువులతో పండించిన కూరగాయలనే గత మూడు ఏళ్లుగా ఇంటికి వాడుకుంటున్నాం. మార్కెట్‌కు వెళ్లి కూరగాయాలు కొని చాలా రోజులవుతోంది. మాకు ఇష్టమైన కూరగాయలను మా ఇంటి మిద్దె పైన పండించుకుంటున్నాం. 12 అంకణాల స్థలంలోనే సుమారు 15 రకాల కూరగాయలను సాగు చేస్తున్నాం. మా కుటుంబంలోని ప్రతి వ్యక్తి సాయంత్రం 4గంటలకు తోట పనిలో నిమగ్నమవుతారు. దీంతో మనసు ఉల్లాసంగా ఉంటుంది. పెరటి, మిద్దె తోటు ఎంతో ఉపయోగకరంగా ఉంటున్నాయి.

– తులసమ్మ, ఉపాధ్యాయనగర్, తిరుపతి



కుండీలో పెరుగుతున్న టమాట మొక్క



మిద్దె తోటలో పండించిన కూరగాయలు



ఇంటి పెరట్లో కాసిన జామ

ఇంటికి సరిపడేలా కూరగాయలు



ఇంటి వద్ద కూరగాయలను పెంచుకోవడమే కాకుండా తోటలో చిన్న చిన్న పనులు చేయడం ద్వారా మంచి వ్యాయామం లభిస్తోంది. మా ఇంటికి సరిపడా కూరగాయులను మేమే పండించుకుంటున్నాం. సుమారుగా 14 రకాల కూరగాయ మొక్కలు మా తోటలో ఉన్నాయి. ఆకు కూరలను సైతం పెంచుతున్నాం. ఇంట్లోని చెత్తనే కంపోస్టు ఎరువుగా మార్చుకుని మొక్కలకు వాడుతున్నాం. తెగులు సోకితే వేపనూనె పిచికారీ చేస్తుంటాం. – **డాక్టర్ ప్రవల్లిక, ఖాదీ కాలనీ**

మార్కెట్‌కు వెళ్లే పనే లేదు



మాకు కూరగాయల మార్కెట్‌కు వెళ్లే పనే లేదు. ఉదయం, సాయంత్రం మిద్దె పైకి వెళ్లి కూరగాయల తోటకు నీళ్లు పడతాం. కుటుంబసభ్యుల్లో ఎవరు ఖాళీగా ఉంటే వారు తోట పనులు చేస్తుంటాం. మిద్దె పైన కూరగాయలు పండిస్తున్నాం. కింద భాగంలో జామ, అరటి చెట్లు పెంచుతున్నాం. దీంతో మా ఇంటి వాతావరణం ఎంతో ఆహ్లాదంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన కూరగాయలను తినే అవకాశదక్కింది. – **కె.రాధాకృష్ణ, తిరుపతి**

భవిష్యత్‌లో ఇంటి వద్దే..!



భవిష్యత్‌లో ఇంటి వద్దే కూరగాయలను సాగు చేయడం అందరికీ అలవాటుగా మారుతుంది. పల్లె వాసులు నగరంలో పెరుగుతున్నారు. వారికి వ్యవసాయంపై అవగాహన ఉండడంతో మిద్దె పైన, పెరటి తోటలు పెంచుతున్నారు. మమ్మల్ని సంప్రదించిన వారికి ఉపయోగపడే సలహాలను కూడా అందిస్తున్నాం. అర్బన్ ప్రాంతాల్లో మిద్దె తోటలు పెరగడం శుభ పరిణామం. తాజా కూరగాయలను ఆహారంలో తీసుకుంటే ఆరోగ్యానికి కూడా మంచిది.

– **దశరథరామిరెడ్డి, ఉద్యానశాఖ జిల్లా అధికారి**

పారిశుద్ధ్యంపై అవగాహనకే 'ప్రదర్శన'

తిరుపతి తుడా : పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకే నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు కార్పొరేషన్ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. స్వచ్ఛతా హీ సేవలో భాగంగా శుక్రవారం ప్రకాశం పార్కు, వైకుంఠపురం ఆర్చి తదితర ప్రాంతాల్లో నాటక ప్రదర్శనలు నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతి ఒక్కరూ తమ ఇంటితో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్త వేరు చేసి ఇవ్వడం వలన కలిగే లాభాలను వివరిస్తూ చిన్నారులు ప్రదర్శించిన నాటకం విశేషంగా ఆకట్టుకుంది. స్వచ్ఛభారత్‌పై విద్యార్థులు ప్రదర్శించిన నృత్యప్రదర్శనలు ప్రేక్షకులను ఆలోచింపజేశాయి.



మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

కార్యక్రమాల్లో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, ఆర్ఓ సేతుమాధవ్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, మెప్మా కృష్ణవేణి, మస్తాన్, మిమిక్రీ కళాకారుడు విజయకుమార్, వే ఫౌండేషన్ అంకయ్య పాల్గొన్నారు.

రూ.1.50 కోట్లతో డ్రైనేజీ నిర్మాణం

తిరుపతి రూరల్ : మండలంలోని అవిలాల పంచాయతీలో రూ.1.50 కోట్లు వెచ్చించి డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు సర్పంచ్ సీవీరమణ తెలిపారు. శుక్రవారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన రోడ్డుపై కొందరు పశువులు కట్టివేస్తున్నారని, దీంతో రాకపోకలకు ఇబ్బందిపడుతున్నట్లు పలువురు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని, డ్రైనేజీ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం రూ.1.50కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో తొలి 100 రోజులకు సంబంధించి అసలు అభివృద్ధి జరగలేదని టీడీపీ గ్రామ అధ్యక్షుడు సాంబశివరావు చేసిన ఆరోపణలను ఎంపీటీసీ సభ్యుడు హరికృష్ణారెడ్డి తిప్పికొట్టారు. జగనన్న సీఎం అయిన తొలి వంద రోజుల్లోనే 1.40 లక్షల ఉద్యోగాలను ఇవ్వడమే కాకుండా, 3 లక్షలకు పైగా వలంటీర్లను నియమించి, గ్రామ సచివాలయ వ్యవస్థతో విప్లవాత్మక పాలన అందించారని స్పష్టం చేశారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు గ్రామసభలో తీర్మానం చేశారు.పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గ్రామ సభలో మాట్లాడుతున్న సర్పంచ్ రమణ

ఘనంగా గంధోత్సవం

తిరుపతి కల్చరల్ : హజ్రత్ పీర్ సయ్యద్ షా నజీర్ అహ్మద్ ఖాదరి 11వ గంధోత్సవం వేడుకలను శుక్రవారం రాత్రి ఎస్వీ ఆర్ట్స్ కళాశాల సమీపంలోని దర్గాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేపట్టారు. అనంతరం ఉర్దూ కవులతో ఏర్పాటు చేసిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. అనంతరం ముజాపర్లు ప్రదర్శించిన హవాలీ, వివిధ రకాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. బోత్ హాస్పిటల్ అధినేత డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై పీఠాధిపతి సమాధి వద్ద పూజలు చేశారు. ముజాపర్ల హవాలీని తిలకించి కానులను అందజేశారు. ప్రభుత్వ ఖాజీ సయ్యద్ షఫీ అహ్మద్ ఖాదరీ మాట్లాడుతూ మతం అంటే మానవత్వమని, కులం అంటే గుణమని తెలిపారు. సంపాదన ముఖ్యం కాదని, సాయం ప్రధానమని, తోటి వారికి సాయం చేయడం ద్వారా జీవితం సార్థకమవుతుందని వివరించారు. అనంతరం అన్నదానం, ప్రసాదం పంపిణీ చేశారు. వక్ఫ్ బోర్డు మాజీ చైర్మన్ సిరాజ్‌బాషా, వజీర్, చాంద్‌బాషా పాల్గొన్నారు.



దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మత పెద్దలు

4 నుంచి నవరాత్రి ఉత్సవాలు

తిరుపతి కల్చరల్ : శ్రీకపిలేశ్వరాలయంలో అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు కామాక్షీదేవి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అమ్మవారు రోజుకో అవతారంలో కొలువై భక్తులకు దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు ఆలయంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఉత్సవాలను పురస్కరించుకొని ఈనెల 29వ తేదీన కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించనున్నారు. అమ్మవారు 4న కామాక్షీదేవిగా, 5న ఆదిపరాశక్తి, 6న మహాలక్ష్మి, 7న మావడిసేవ, 8న శ్రీఅన్నపూర్ణాదేవి, 9న దుర్గాదేవి, 10న మహిషాసుర మర్ధిని, 11న సరస్వతీదేవి, 12న శివపార్వతుల అలంకారంలో భక్తులను కటాక్షించనున్నారు. చివరి రోజు 12వ తేదీన పార్వేట ఉత్సవం జరిపించనున్నారు.

తిరుచ్చిపై సిరుల తల్లి

చంద్రగిరి(తిరుచానూరు) : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు శుక్రవారం సాయంత్రం బంగారు తిరుచ్చి భక్తులకు అభయమిచ్చారు. వారపు ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్యకైంకర్యాలు సమర్పించారు. అనంతరం అభిషేక సేవను చేపట్టి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలోని శ్రీకృష్ణ ముఖమండపంలో స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం నిర్వహించారు. సాయంత్రం అలంకార మండపంలో ఊంజల్‌సేవ జరిపించారు. అనంతరం అలంకారభూషితురాలైన అమ్మవారు బంగారు తిరుచ్చిపై కొలువుదీరి మాడ వీధుల్లో విహరించారు

మహిళల ప్రతిభకు ఆకాశమే హద్దు



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

తిరుపతి సిటీ : మహిళల ప్రతిభకు ఆకాశమే హద్దని, పురుషులతో పోటీపడి వివిధ రంగాల్లో రాణిస్తున్నారని ఎస్వీయూ సీడీసీ డీన్ ప్రొఫెసర్ చంద్రానాయుడు తెలిపారు. శుక్రవారం శ్రీపద్మావతి డిగ్రీ, పీజీ కళాశాలలో నూతన విద్యార్థి సంఘం ప్రారంభోత్సవం నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. చంద్రానాయుడు మాట్లాడుతూ విద్యార్థి దశ విలువైందని, సద్వినియోగం చేసుకుంటే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని సూచించారు. టీటీడీ డీఈఓ డాక్టర్ వై.నాగరాజు నాయుడు మాట్లాడుతూ విద్యార్థినులు ఆత్మవిశ్వాసం కోల్పోకుండా పట్టుదలగా తాము ఎంపిక చేసుకున్న లక్ష్యాలను చేరుకోవాలని కోరారు. సమస్య ఎదురైనప్పుడు లోలోపల బాధపడకుండా గురువులను సంప్రదించి పరిష్కరించుకోవాలని తెలిపారు. నిరంతర శ్రమతో తల్లిదండ్రులు, కళాశాలకు మంచి పేరు తీసుకురావాలన్నారు. ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ 2023–24 విద్యాసంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన వారిని విద్యార్థి సంఘ సభ్యులుగా ఎన్నుకున్నట్లు వెల్లడించారు. సంఘం అధ్యక్షురాలిగా ఎంపికైన పి.సోనీ, ఇతర సభ్యులకు అభినందనలు తెలిపారు. అనంతరం విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిల్ ఇన్‌చార్జి డాక్టర్ బి.జ్యోతి, డాక్టర్ భద్రమణి, డాక్టర్ సి.భువనేశ్వరీదేవి, మ్యూజిక్ కాలేజీ ప్రిన్సిపల్ ఉమ మధుబాల, అధ్యాపకులు విద్యుల్లత, హేమలత, ఉమాదేవి, జయశ్రీ, వై.శిరీష, సాయికుమారి, నాగపద్మ, లక్ష్మి, సుహాసిని, కస్తూరి, శోభ, ప్రవీణ, వరప్రసూన పాల్గొన్నారు.

చంద్రగిరి సబ్ రిజిస్ట్రార్‌గా కొండారెడ్డి



చంద్రగిరి : సబ్ రిజిస్ట్రార్ జీవీ కొండా రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాళహస్తి నుంచి బదిలీపై ఆయన ఇక్కడకు వచ్చారు. కొండారెడ్డి మాట్లాడుతూ నిబంధనల మేరకు వినియోగదారులకు నాణ్యమైన సేవలను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు.

అనుమతి లేకుండా సభలు నిర్వహిస్తే చర్యలు

పాకాల : అనుమతి లేకుండా సభలు, ఊరేగింపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ మద్దయ్య ఆచా రి హెచ్చరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 24వ తేదీ వరకు సెక్షన్–30 పోలీస్ యాక్ట్ అమలులో ఉంటుందని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు తప్పవని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీల నేతలు, కార్యకర్తలు సంయమనంతో వ్యవహరిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు.

పర్యాటక ప్రమోషన్‌కు పురస్కారం



అవార్డు అందుకుంటున్న రమణప్రసాద్

తిరుపతి(అలిపిరి): పర్యాటక–ఆతిథ్య రంగం ప్రమోషన్‌లో ఉత్తమ జిల్లాగా తిరుపతి అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ కింద ఎంపికైంది. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లె కళాక్షేత్రంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా తిరుపతి పర్యాటక ప్రాంతీయ సంచాలకుడు రమణ ప్రసాద్ అవార్డు అందుకున్నారు.

ప్రెస్ క్లబ్ వేదిక ఆధునికీకరణ

తిరుపతి కల్చరల్ : తిరుపతి ప్రెస్ క్లబ్ లో ప్రెస్మీట్ వేదిక ఆధునికీకరణ పూర్తయింది. శుక్రవారం ఉదయం ఈ మేరకు వేదికను ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు భాస్కర్ రెడ్డి, సెక్రటరీ బాలచంద్ర, కోశాధికారి శ్రీకాంత్, ఈసీ మెంబర్ సునీల్ ప్రారంభించారు. కార్పొరేషన్ రెవెన్యూ ఆఫీసర్ కేఎల్ వర్మ , ట్రెక్కింగ్ బాలు, బీవీ రమణ ఆధ్వర్యంలో రూ.42వేలతో వేదికను తీర్చిదిద్దినట్లు ప్రెస్ క్లబ్ కమిటీ తెలిపింది.

నిర్బంధం



తిమ్మారెడ్డి | కోలా సురేష్ | రవి | సురేష్ రాయల్ | లోకేష్ | బాలాజీ | కోదండ ఆచారి, ఊతిగుంట మోహన్

సాక్షి ప్రతినిధి, తిరుపతి : వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి శుక్రవారం తిరుమలకు వస్తున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు, క్రియాశీలకంగా ఉన్న కార్యకర్తలను నివాసంలో నుంచి వెలుపలకు రానివ్వకుండా పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. పోలీస్ యాక్ట్–30 అమలులో ఉన్నందున అక్టోబర్ 24 వరకు సభలు, సమావేశాలు, ర్యాలీలు, నిరసనలు, భారీ జనసమూహాలకు ఎటువంటి అనుమతులు లేవని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరికలు జారిచేసి నోటీసులు అందించారు.

కార్గోలో 'ప్యాకింగ్' ప్రాబ్లమ్

తిరుపతి అర్బన్ : తిరుపతి సెంట్రల్ బస్టాండ్‌లోని కార్గో సెంటర్‌లో పార్శిళ్ల ప్యాకింగ్ ప్రాబ్లమ్స్ తలెత్తుతున్నాయి. దీంతో నిర్వాహకులు, కస్టమర్లకు నిత్యం గొడవలు జరుగుతున్నాయి. కార్గో సెంటర్‌కు రోజూ వందల సంఖ్యలో పార్శిళ్లు వస్తుంటాయి. అయితే కొన్నిసార్లు కస్టమర్లు సక్రమంగా ప్యాకింగ్ చేయలేదని నిర్వాహకులు తిప్పిపంపుతున్నారు. దీంతో పార్శిల్‌ను మళ్లీ ప్యాక్ చేసేందుకు వినియోగదారులు నానా అవస్థలు పడుతున్నారు. ఒక్కోసారి పార్శిల్‌లోని వస్తువులు చూపాలని నిర్వాహకులు ఒత్తిడి చేస్తున్నారు. పార్శిల్ ఓపెన్ చేసిన తర్వాత రీప్యాకింగ్ చేసేందుకు కస్టమర్లకు ఇక్కట్లు తప్పడం లేదు. కార్గో సెంటర్ వద్ద ప్యాకింగ్ సౌకర్యం కల్పించాలని వినియోగదారులు కోరుతున్నారు. లేకుంటే కార్గో సెంటర్ నిర్వాహకులే ప్యాకింగ్ చేసుకునేలా చర్యలు చేపట్టాలని సూచిస్తున్నారు.

సమస్య పరిష్కరిస్తాం

కార్గోలో పార్శిల్ రీ ప్యాకింగ్ సమస్యను పరిష్కరిస్తాం. వినియోగదారులతో నిర్వాహకులకు ఎలాంటి వివాదాలు తలెత్తకుండా చర్యలు చేపడతాం. కస్టమర్లతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఇప్పటికే ఆదేశాలు జారీ చేశాం.

– రామచంద్రనాయుడు, ఆర్టీసీ కార్గో జిల్లా ఇన్‌చార్జి